

నయనానందకరం

ఆళ్లగడ్డ: లక్ష్మీనరసింహ స్వామి వసంతోత్సవాలు నేత్రపర్వంగా కొనసాగుతున్నాయి. మంగళవారం దిగువ అహోబిలంలో ఉత్సవమూర్తులకు తిరుమంజనం నిర్వహించారు.



శ్రీశైలంలో ఎస్టీ కమిషన్ చైర్మన్

శ్రీశైలంటెంపుల్: శ్రీ భ్రమరాంబా మల్లికార్జున స్వామివార్లను మంగళవారం రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ కుంభ రవిబాబు, సభ్యులు వడిత్యా శంకర్‌నాయక్‌లు దర్శించుకున్నారు.



కన్నీటి వీడ్కోలు

ఆలూరు మాజీ ఎమ్మెల్యే నీరజారెడ్డికి అభిమానులు, బంధువులు కన్నీటి వీడ్కోలు పలికారు. ఆమె స్వగ్రామమైన తెర్నేకల్‌లో మంగళవారం అంత్యక్రియలు నిర్వహించారు. 8లో▸



రంజాన్ వేళలు

	ఇఫ్తార్	సహెర్
కర్నూలు	సా॥ 6:39	ఉ॥ 4:36
ఆదోని	సా॥ 6:42	ఉ॥ 4:39
నంద్యాల	సా॥ 6:39	ఉ॥ 4:39
ఆత్మకూరు	సా॥ 6:37	ఉ॥ 4:33
బనగానపల్లె	సా॥ 6:42	ఉ॥ 4:33

హదీస్ వెలుగు :

మీ సంతానం తప్పుల పట్ల శాపనార్థాలు పెట్టకండి. పవిత్ర రంజాన్ మాసంలో మీ శాపాల పట్ల దైవదూతలు ఆమీన్ అంటే అల్లాహ్ దానిని నిజం చేస్తారు. – పవిత్ర ఖురాన్



'భగ'వంతుడా!

ఉష్ణోగ్రతలు భారీగా పెరగడంతో మంగళవారం మధ్యాహ్నం కర్నూలు నగర శివారులో జాతీయ రహదారిపై కనిపించిన ఎండమావి

-సాక్షిఫొటోగ్రాఫర్, కర్నూలు

భానుడు ఉగ్రరూపం దాలుస్తున్నాడు. ఉమ్మడి కర్నూలు జిల్లా నిప్పుల కొలిమిని తలపిస్తోంది. ఇంటి నుంచి బయటికి వస్తే చాలు.. వడగాలులు ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. రాష్ట్రంలోనే అత్యధికంగా ఇక్కడ ఉష్ణోగ్రతలు నమోదు అవుతుండటం ఆందోళన కలిగిస్తోంది. రానున్న రోజుల్లో ఎండల తీవ్రత మరింత పెరిగే అవకాశం ఉండటంతో ముందుజాగ్రత్త చర్యలు తీసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

నిప్పుల వర్షం

రికార్డుస్థాయిలో 45.62 డిగ్రీల ఉష్ణోగ్రత

● ఈనెల 18న మధ్యాహ్నం 1 గంటకు..
నంద్యాల జిల్లా పాములపాడులో 44.35, చాగలమర్రిలో 44.22 డిగ్రీలు, కర్నూలు జిల్లా ఆలూరు మండలం కమ్మరచేడు గ్రామంలో 44.17 డిగ్రీల ప్రకారం ఎండల తీవ్రత ఉన్నట్లు స్పష్టమవుతోంది.

● మధ్యాహ్నం 2 గంటలకు..
కర్నూలు మండలం పూడూరులో 45.62 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. అంటే గంట గంటకు ఎండల తీవ్రత ఏస్థాయిలో పెరుగుతుందో అర్థమవుతోంది.

మధ్యాహ్నం 3 గంటలకు..

ప్రాంతం	ఉష్ణోగ్రత(డిగ్రీల్లో)
చాగలమర్రి	44.57
పాములపాడు	44.04
గోకవరం(కొత్తపల్లి మండలం)	44.0
మంత్రాలయం	44.17
చిన్నతుంబళం (పెద్దకడుబూరు మండలం)	43.79



నంద్యాలలో నిర్మానుష్యంగా ప్రధాన రహదారి

- గంట గంటకు పెరుగుతున్న ఎండలు, వడగాలుల తీవ్రత
- ఇప్పటికే గోనెగండ్లలో పగిలిన బండరాయి
- రానున్న రోజుల్లో ఉష్ణోగ్రతలు మరింత పెరిగే ప్రమాదం
- అడవులు తరుగుతుండటమే ప్రధాన కారణం

కర్నూలు(అగ్రికల్చర్)/నంద్యాల: ఈ వేసవిలో రికార్డు స్థాయిలో 45.62 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. రానున్న రోజుల్లో ఉష్ణోగ్రత 50 డిగ్రీలకు చేరవచ్చనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. కర్నూలు, నంద్యాల జిల్లాల్లో సాధారణం కంటే 2–4 డిగ్రీల వరకు అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి.కర్నూలు జిల్లాలో ఎండల వేడిమికి బండరాళ్లు కూడా పగులుతున్నాయి. గోనెగండ్లలో ఎండల తీవ్రతకు పెద్ద బండరాయి పగలడం రాష్ట్రంలో సంచలనం కలిగించింది. రానున్న రోజుల్లో రోహిణి కార్తె సమయానికి వచ్చే ఎండలను తలచుకుని ప్రజలు బెంబేలెత్తుతున్నారు.

తప్పని సరి అయితేనే బయటకు వెళ్లాలి

ఎండ తీవ్రతతో శరీర ఉష్ణోగ్రత పెరిగితే మెదడులో హైపోథాలమస్ దెబ్బతిని అపస్మారక స్థితికి వెళ్లిపోతారు. శరీరానికి చెమట పట్టకపోవడం, శరీర ఉష్ణోగ్రత పెరగడం, వణుకు పుట్టడం, మగత నిద్రలోకి వెళ్లడం వంటి లక్షణాలతో బాధపడే వారిని గాలి తగిలే ప్రాంతంలో ఉంచాలి. అత్యవసరమైతే తప్ప ప్రజలు బయటకు వెళ్లాలి. – వెంకటరమణ,డీఎంహెచ్‌ఓ, నంద్యాల



ఉష్ణోగ్రతలు ఎందుకు పెరుగుతున్నాయంటే..

- ➡ అడవులు తరిగిపోతుండటం, పచ్చదనం కనుమరుగు అవుతుండటం.
- ➡ జిల్లా విస్తీర్ణంలో అడవులు 33 శాతం వరకు ఉండాలి.
- ➡ ఉమ్మడి కర్నూలు జిల్లాలో కేవలం 16 శాతం మాత్రమే అడువులు ఉన్నట్లు తెలుస్తోంది.
- ➡ కర్నూలు జిల్లా మొత్తంగా 33వేల హెక్టార్లలో మాత్రమే అడవులు ఉన్నాయి. ఇవి కూడా సాధారణ అడువులే.
- ➡ అడవులు తరిగిపోతుండటానికి తోడు వాయు కాలుష్యం పెరిగిపోతోంది.

జాగ్రత్తలు తప్పనిసరి

- ☛ వడదెబ్బకు గురి కాకుండా ఉండాలంటే ఉదయం 12 నుంచి 3 గంటల మధ్య అవసరమైతే తప్ప బయట తిరగరాదు.
- ☛ మధ్యాహ్నం సమయంలో శారీరక శ్రమతో కూడిన పనులు చేయరాదు.
- ☛ అత్యవసరమై బయటికి వెళితే గొడుగు తప్పనిసరి.
- ☛ తలనొప్పి, తల తిరగడం, తీవ్రమైన జ్వరం కలిగి ఉండటం, మత్తునిద్ర, ఫిట్స్, పాక్షిక లేదా పూర్తి ఆపస్మారక స్థితి ఇవన్నీ వడదెబ్బ లక్షణాలు.
- ☛ దాహం వేయకపోయినా తరచూ చల్లని నీరు ఎక్కువగా తాగాలి.
- ☛ ఉప్పు కలిపిన మజ్జిగ, గ్లూకోజు, కొబ్బరి నీళ్లు వీలైనంత ఎక్కువగా తీసుకోవాలి.



కర్నూలు: ముసుగు లేనిదే ముందుకు కదల్లేం



టవాల్ రక్షణతో ఎద్దులబండి తోలుతున్న మహిళ



ఎండ వేడిమికి తాళలేక దోన్ సమీపంలో చెట్టు తొర్రలో దాక్కున్న వానరం

న్యూస్‌రీల్

నీటిని పొదుపు చేద్దాం



మాట్లాడుతున్న శ్రీనివాసరావు

వెల్దుర్తి: నీటిని పొదుపు చేసి భావితరాలకు కరువు రహిత సమాజాన్ని అందించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని భూగర్భ జలాలు, జల గణన శాఖ జిల్లా డిప్యూటీ డైరెక్టర్ ఎం శ్రీనివాసరావు అన్నారు. నేషనల్ హైడ్రాలజీ ప్రాజెక్ట్ కింద ఆజాదీకా అమృత్ మహోత్సవ్ కార్యక్రమంలో భాగంగా వెల్దుర్తిలో మంగళవారం భూగర్భ జలాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. స్థానిక బాలుర హాస్టల్ నుంచి విద్యార్థులతో ఆర్బీకే వరకు ర్యాలీ నిర్వహించారు. పాతబస్టాండులో మానవహారం ఏర్పాటు చేసి జల సంరక్షణే జన సంరక్షణ అంటూ ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఆర్బీకేలో రైతులు, విద్యార్థులతో సమావేశం నిర్వహించారు. జిల్లాలో భూగర్భ జలాల లభ్యత, వాడకంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ పోతులయ్య, డ్వామా అడిషనల్ పీడీ సలీం, రిటైర్డ్ డీడీ వెంకట్రామిరెడ్డి, సర్పంచ్ ముత్యాల శైలజ తదితరులు పాల్గొన్నారు.

బదిలీ పోలీసులకు పోస్టింగ్‌లు

కర్నూలు: జిల్లా పునర్విభజన నేపథ్యంలో పోలీసు శాఖలో ఈ నెల 9న జరిగిన పరస్పర బదిలీల్లో భాగంగా నంద్యాల జిల్లా నుంచి కర్నూలు జిల్లాకు బదిలీపై వచ్చి వీఆర్‌లో ఉన్న 23 మంది సిబ్బందికి ఎస్పీ కృష్ణకాంత్ స్టేషన్లు కేటాయిస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. కర్నూలు జిల్లా నుంచి నంద్యాల జిల్లాకు 30 మంది, అక్కడ పనిచేస్తున్న 30 మందిని కర్నూలు జిల్లాకు బదిలీ చేస్తూ గతంలో ఉత్తర్వులు వెలువడ్డాయి. అందులో భాగంగా జిల్లాకు వచ్చి వీఆర్‌లో ఉన్న 23 మందికి తాజాగా స్టేషన్లు కేటాయిస్తూ ఎస్పీ ఉత్తర్వులిచ్చారు. ఇందులో 8 మంది హెడ్ కానిస్టేబుళ్లు, 14 మంది కానిస్టేబుళ్లు, ఒక మహిళా కానిస్టేబుల్ ఉన్నారు. వెంటనే వారికి కేటాయించిన స్థానాల్లో చేరాలని ఉత్తర్వుల్లో ఎస్పీ పేర్కొన్నారు.

ఇంటి వద్దకే వైద్యం



ఆరోగ్య సర్వేను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ

గడివేముల: ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్‌తో ప్రజల ఇంటి వద్దకే వైద్యులు వస్తున్నారని డీఎంహెచ్‌ఓ డాక్టర్ వెంకటరమణ అన్నారు. గడివేముల ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని మంగళవారం ఆయన తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి, ఆరోగ్యశాఖలో పనిచేస్తున్న ప్రతి ఉద్యోగి ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్‌పై ప్రజలకు తెలియజేయాలన్నారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆరోగ్యసర్వేను పరిశీలించారు. కార్యక్రమంలో డాక్టర్లు మొల్లా జబీన్‌తేజస్విని, ఫార్మసిస్ట్ రాజ్‌కుమార్ ఆశావర్కర్లు పాల్గొన్నారు.

'రైజింగ్ ఇండియా'కు 29 స్కూళ్ల ఎంపిక

కర్నూలు(సిటీ): ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు నాణ్యమైన మెరుగైన విద్యను అందించాలనే లక్ష్యంతో ప్రధానమంత్రి నరేంద్రమోదీ.. పీఎం స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా అనే పథకానికి శ్రీకారం చుట్టారు. ఈ పథకం కింద జిల్లాలో 29 పాఠశాలలను ఎంపిక చేశారు. ఈ పాఠశాలలకు రాబోయే ఐదు సంవత్సరాల్లో విడతల వారీగా పూర్తి స్థాయిలో అభివృద్ధి చేయనున్నారు. ఈ పథకానికి జిల్లా విద్యాశాఖ అధికారి నోడల్ అధికారిగా వ్యవహరిస్తారు. ఎంపికైన పాఠశాలల్లో డిజిటల్ విద్యావిధానాన్ని అమలు చేస్తారు. దేశ స్థాయిలో ఉన్న సిలబస్‌ను బోధించేలా ఉపాధ్యాయులకు వృత్యంతర శిక్షణ ఇవ్వనున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి డాక్టర్ వి.రంగారెడ్డి, సమగ్ర శిక్ష అదనపు కోఆర్డినేటర్ డాక్టర్ కె.వేణుగోపాల్‌లు మంగళవారం ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు.

భూసేకరణ పనులు వేగవంతం చేయండి



వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరైన కలెక్టర్ సృజన, జేసీ ఎన్.మౌర్య తదితరులు

కర్నూలు(సెంట్రల్): భూసేకరణ పనులను వేగవంతం చేయాలని మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్, అర్బన్ డెవలప్‌మెంట్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ శ్రీలక్ష్మి అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆమె విజయవాడ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. మునిసిపాలిటీలు, నగర పంచాయతీల్లో అవసరమైన భూసేకరణ, కన్వర్షన్, ఇతర అభివృద్ధి పనులను వేగవంతం చాయలన్నారు. ఇందుకోసం కమిషనర్లు.. ఆర్డీఓలు, ఎస్‌డీసీల సహకారం తీసుకోవాలన్నారు. గూడూరు మునిసిపాలిటీలో మంచినీటి ట్యాంకు కోసం 1.52 సెంట్ల భూసేకరణ చేస్తున్నామని, త్వరలోనే పూర్తిస్థాయి నివేదికలు అందజేస్తామని కలెక్టర్ డాక్టర్ జి.సృజన ఆమెకు వివరించారు. కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో జేసీ ఎన్.మౌర్య, మునిసిపల్ కమిషనర్ భార్గవ్‌తేజ పాల్గొన్నారు.

ఈ ఏడాది 300 ఎకరాల్లో మల్బరీ సాగు

- ఎస్సీ, ఎస్టీలకు 90 శాతం, ఇతరులకు 75 శాతం సబ్సిడీ
- ఈ ఏడాది 1,132 టన్నుల పట్టు గూళ్ల ఉత్పత్తి
- జిల్లా పట్టు పరిశ్రమ శాఖ అధికారి విజయకుమార్ వెల్లడి



కర్నూలు(అగ్రికల్చర్): జిల్లాలో 2023–24లో మల్బరీ సాగును పెంచడం ద్వారా పట్టు పరిశ్రమను అభివృద్ధి చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ ఏడాది 300 ఎకరాల్లో మల్బరీ సాగు చేసేలా ప్రభుత్వం జిల్లాకు లక్ష్యాన్ని ఇచ్చింది. జిల్లాలో అనుకూలమైన ఎర్ర నేలలు ఎక్కువగా ఉండటంతో మల్బరీ సాగుకు ప్రోత్సహించేందుకు పట్టు పరిశ్రమ శాఖ అధికారులు చర్యలు చేపట్టారు. మల్బరీ సాగు, షెడ్ల నిర్మాణం తదితరాలకు ఎస్సీ, ఎస్టీలకు 90 శాతం, ఇతరులకు 75 శాతం ప్రకారం సబ్సిడీ ఉండటం విశేషం. మల్బరీ సాగుకు సంబంధించి ఎకరాకు యూనిట్ కాస్ట్ రూ.25వేలు ఉండగా.. ఎస్సీ, ఎస్టీలకు రూ.22,500.. ఇతరులకు రూ.18,500 సబ్సిడీ ఉంటుందని జిల్లా పట్టు పరిశ్రమ శాఖ అధికారి విజయకుమార్ తెలిపారు. మంగళవారం తన కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో 2023–24 లక్ష్యాలు, సబ్సిడీలను వివరించారు. గరిష్టంగా 5 ఎకరాల వరకు సబ్సిడీ వర్తిస్తుందన్నారు. 300 ఎకరాల్లో మల్బరీ మొక్కలు నాటేందుకు 18 లక్షల మొక్కలతో కిసాన్ నర్సరీలను అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. ఇప్పటికే 3 లక్షల మొక్కలు సిద్ధంగా ఉన్నాయన్నారు. ఉన్నాయని వివరించారు.

గురుకుల ప్రవేశాలకు 23న పరీక్ష

కర్నూలు(అర్బన్)/నంద్యాల: జిల్లాలోని సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కొనసాగుతున్న గురుకుల విద్యాలయాల్లో 5వ తరగతి, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ప్రవేశాలకు సంబంధించి ఈ నెల 23న పరీక్ష నిర్వహిస్తున్నట్లు ఏపీఎస్‌డబ్ల్యూఆర్‌ఈఐ సొసైటీ జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ ఐ.శ్రీదేవి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కర్నూలు జిల్లాలో 8, నంద్యాల జిల్లాలో 6 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. 5వ తరగతి ప్రవేశాలకు సంబంధించి మొత్తం 1,040 సీట్లకు 10,514 దరఖాస్తులు.. ఇంటర్ మొదటి సంవత్సరం ప్రవేశాలకు 1,400 సీట్లకు 6,056 దరఖాస్తులు వచ్చాయన్నారు. 23వ తేదిన ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు 5వ తరగతికి.. ఇంటర్మీడియట్ విద్యార్థులకు అదే రోజున మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు పరీక్ష నిర్వహిస్తామన్నారు. 5వ తరగతి విద్యార్థులు http://apgpcet.apcfss.in, ఇంటర్మీడియట్ విద్యార్థులు htpp://apgpcet.apcfss.in/inter వెబ్‌సైట్ ద్వారా తమ హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. హాల్‌టికెట్‌లో ఫొటో తప్పుగా ఉన్నవారు కచ్చితంగా తమ ఒరిజినల్ ఆధార్‌కార్డు తీసుకురావాలన్నారు.

ఓపెన్ స్కూల్ ప్రాక్టికల్ పరీక్షలు ప్రారంభం

కర్నూలు(సిటీ) : జిల్లాలో ఓపెన్ స్కూల్ సొసైటీ ద్వారా ఇంటర్మీడియట్ చదివిన సైన్స్ విద్యార్థులకు మంగళవారం నుంచి ప్రాక్టికల్ పరీక్షలను ప్రారంభించారు. ఉదయం జరిగిన పరీక్షలకు 121 మంది విద్యార్థుల్లో 91 మంది హాజరు కాగా.. 31 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం నిర్వహించిన పరీక్షకు మొత్తం 125 మందిలో 111 మంది హాజరు కాగా.. 14 మంది గైర్హాజరయ్యారు.

కంటి పరీక్షలతో చిన్నారుల జీవితాల్లో వెలుగు



కంటి అద్దాల పంపిణీ చేసిన అనంతరం విద్యార్థులతో మేయర్ బీవై రామయ్య

కర్నూలు(హాస్పిటల్): వైఎస్‌ఆర్ కంటి వెలుగు కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో దృష్టిలోపాన్ని సరి చేసి వారి జీవితాల్లో వెలుగులు నింపుతున్నారని కర్నూలు నగర మేయర్ బీవై రామయ్య అన్నారు. మంగళవారం ఎ.క్యాంపులోని మున్సిపల్ హైస్కూల్‌లో 56 మంది విద్యార్థినీ విద్యార్థులకు కంటి అద్దాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ కంటి వెలుగు కార్యక్రమం ద్వారా అవ్వాతాతలతో పాటు విద్యార్థినీ విద్యార్థులకు సైతం కంటి పరీక్షలు నిర్వహిస్తున్నారన్నారు. విద్యార్థుల ఆరోగ్యం పట్ల కూడా రాష్ట్ర ప్రభుత్వం శ్రద్ధ చూపిస్తోందన్నారు. జిల్లా అంధత్వ నివారణ అధికారి డాక్టర్ జి. భరత్ మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాలో 66,836 మందికి కంటి పరీక్షలు నిర్వహించగా 3,395 మందికి దృష్టిలోపాలు ఉన్నట్లు గుర్తించామన్నారు. వారందరికీ కంటి అద్దాలు ఉచితంగా పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆప్తాల్మిక్ ఆఫీసర్లు పి. మహేశ్వరరెడ్డి, పరమేశ్వరరెడ్డి, కవిత, పాఠశాల హెచ్‌ఎం వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి 'పది' మూల్యాంకనం

కర్నూలు(సిటీ): పదో తరగతి పరీక్షల మూల్యాంకనం బుధవారం నుంచి ప్రారంభం కానుంది. కర్నూలు ఎ.క్యాంప్‌లోని మాంటిస్సోరి స్కూల్‌లో మూల్యాంకనం కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. క్యాంప్ ఆఫీసర్‌గా జిల్లా విద్యాశాఖ అధికారి వ్యవహరించనున్నారు. మూల్యాంకనానికి వివిధ జిల్లాల నుంచి 2,01,059 సమాధానపత్రాలు జిల్లాకు చేరాయి. ఇందులో ఇంగ్లిష్ 26,212, తెలుగు 20,470, హిందీ 38,524, భౌతిక/జీవశాస్త్రం 28,113, సాంఘిక శాస్త్రం 27,500, కాంపోజిట్ తెలుగు 6,561, వృత్తి విద్య 1,500, కన్నడ 3,000 సమాధానపత్రాలు ఉన్నాయి. ఈ సమాధానపత్రాలను మూల్యాంకనం చేసేందుకు 611 మంది అసిస్టెంట్ ఎగ్జామినర్లు, 301 మంది చీఫ్ ఎగ్జామినర్లు, 296 మంది స్పెషల్ అసిస్టెంట్లను నియమించారు. మూల్యాంకనం క్యాంప్ ప్రతిరోజు ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల వరకు జరగనుంది. ప్రతి అసిస్టెంట్ ఎగ్జామినర్ రోజుకు 40 సమాధానపత్రాలను మూల్యాంకనం చేయాల్సి ఉంటుంది. మూల్యాంకన విధులకు హాజరు కాని వారిపై శాఖాపరమైన చర్యలు ఉంటాయని డీఈఓ డాక్టర్ వి.రంగారెడ్డి ప్రకటించారు. నంద్యాల జిల్లాకు చెందిన ఉపాధ్యాయులు హెచ్‌ఎం అనుమతి తీసుకుని నేరుగా పాల్గొనవచ్చన్నారు.

ఒకేషనల్ పరీక్షకు 50 మంది గైర్హాజరు

ఈనెల 3వ తేదీన మొదలైన పదో తరగతి పరీక్షలు 15వ తేదీ నాటికి పూర్తయ్యాయి. మంగళవారం నిర్వహించిన ఒకేషనల్ పరీక్షకు 3,639 మంది విద్యార్థులకు గాను 3,589 మంది హాజరయ్యారు. 50 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు.





బడీరాత్‌ను ముస్లింలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఇషా, తరావీహ్ నమాజ్‌ల తరువాత బయాన్, రంజాన్ విశిష్టతలపై మౌల్వీలు ప్రసంగించారు. మంగళవారం రాత్రంతా జాగరణ చేసి అల్లాహ్ నామస్మరణలో గడిపారు. పై చిత్రంలో కర్నూలు నాగిరెడ్డి రెవెన్యూ కాలనీ మున్వరా మసీదులో ప్రార్థనలు చేయిస్తున్న హాఫిజ్‌సాబ్ ఇస్మాయిల్. - సాక్షిఫొటోగ్రాఫర్, కర్నూలు

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం


గొల్ల వీరకృష్ణ యాదవ్ (ఫైల్)

నందవరం: మోటారు సైకిల్‌ను టాటా ఏస్ వాహనం ఢీకొనడంతో ఓ యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ దుర్ఘటన ముగతి- నందవరం ప్రధాన రహదారిలో ఎల్లెల్సీ వద్ద చోటుచేసుకుంది. మృతుని కుటుంబ సభ్యులు, ఎస్ఐ మహేష్‌కుమార్ తెలిపిన వివరాల మేరకు.. కొత్త కై రవాడి గ్రామానికి చెందిన గొల్ల రాముడు, పెద్దలక్ష్మీ దంపతుల ఏకైక కుమారుడు గొల్ల వీరకృష్ణ యాదవ్(25) ఎమ్మిగనూరు నుంచి బైక్‌పై స్వగ్రామానికి బయలు దేరాడు. ముగతి- నందవరం ప్రధాన రహదారిలోని ఎల్లెల్సీ వద్ద టాటా ఏస్ వాహనం ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. కుమారుడి మృతితో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపించారు. గొల్ల వీరకృష్ణ యాదవ్ బొలేరో వాహనం నడుపుతూ కుటుంబానికి ఆసరాగా ఉండేవాడు. ఆయనకు భార్య గిరిజ, ఏడాది కుతూరు, రెండేళ్ల కుమారుడు ఉన్నారు. ప్రస్తుతం గిరిజ మూడు నెలల గర్భిణి. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ తెలిపారు.

వ్యక్తి ఆత్మహత్య


బోయ మీనిగ లక్ష్మయ్య (ఫైల్)

నందవరం: కనకవీడు గ్రామంలో బోయ మీనగ లక్ష్మయ్య (38) పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. వ్యవసాయంలో నష్టం రావడం, పుట్టింటికి వెళ్లిన భార్య నాగమ్మ ఇంటికి రాకపోవడంతో మనస్తాపం చెందాడు. సోమవారం సాయంత్రం తన పొలంలో మద్యంలో పురుగు మందు కలుపుకుని తాగాడు. స్థానిక రైతులు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించగా చికిత్స నిమిత్తం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతి చెందాడు. మంగళవారం మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులు అందజేశారు. మృతుడికి కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మృతుడి భార్య నాగమ్మ ఫిర్యాదు మేరకు హెడ్ కానిస్టేబుల్ పరమేష్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

వేసవిలో విద్యుత్ కోతలు ఉండవు

ఆదోని అర్బన్: వేసవి కాలంలో విద్యుత్ కోతలు ఉండకుండా ప్రతిరోజు 5 వేల నుంచి 7 వేల మిలియన్ యూనిట్ల కరెంట్‌ను కొనుగోలు చేస్తున్నామని ఏపీఎస్‌పీడీసీఎల్ టెక్నికల్ డైరెక్టర్ సుబ్బరాజు తెలిపారు. స్థానిక డీఈ కార్యాలయాన్ని మంగళవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆదోనిలో సబ్‌స్టేషన్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. టిడ్కో ఇళ్లకు రూ.450కే విద్యుత్ కనెక్షన్ ఇస్తున్నామని, ఇప్పటి వరకు 2 వేల కనెక్షన్లు ఇచ్చినట్లు చెప్పారు. విద్యుత్ శాఖకు రూ.7,800 కోట్ల ప్రభుత్వ, రూ.18 వేల కోట్ల ప్రయివేట్ బకాయిలు ఉన్నాయన్నారు. విద్యుత్ సమస్యలపై 1912 నంబర్‌కు ఫిర్యాదు చేస్తే వెంటనే స్పందిస్తారని తెలిపారు. సమావేశంలో ఎస్ఈ ఉమాపతి, ఆదోని డీఈ సుధాకర్‌కుమార్, ఏఈలు పాల్గొన్నారు.

అవ్వకు ఆదాబ్



చిత్రంలో కనిపిస్తున్న వృద్ధురాలి పేరు అల్ హజ్ సలీమాబీ. ఊరు ఆలూరు. వయస్సు 70 ఏళ్లు. పవిత్ర మక్కా యాత్రకు వెళ్లి వచ్చింది. ఏటా రంజాన్ నెలంతా ఉపవాసాలు ఉంటోంది. అంతేకాదు ప్రతి రోజు తెల్లవారు జామున 2 గంటలకు నిద్రలేచి తానే ఇంటిల్లిపాదికి వంటలు చేయడంలో సహాయం చేస్తోంది. ఖురాన్ చదువుతూ, నమాజ్, దువా చేస్తూ ఆధ్యాత్మికంగా జీవితాన్ని గడుపుతోంది. యుక్త వయస్సులో ఉన్న వారు ఉపవాస దీక్షలు పాటించడం కష్టంగా భావిస్తుండగా వృద్ధాప్యంలో అల్లాహ్‌ను శక్తివంచన లేకుండా ఆరాధిస్తున్న అవ్వకు ఆదాబ్ చెప్పాల్సిందే.

అల్లాహ్ ఆరాధనలో అలుపు ఉండదు



రంజాన్ మాసంలో మహిళలకు పని అధికంగానే ఉంటుంది. పగలంతా ఇంటి పనులు, రాత్రి ఆలస్యంగా పడుకోవడం, అర్ధరాత్రి 2 గంటల తరువాత నిద్ర లేచి సహేరికి వంటలు సిద్ధం చేయడం అలవాటు అయ్యింది. అల్లాహ్ భక్తిలో ఎంత శ్రమించినా అలుపు ఉండదు.

– సయ్యద నసీమా బాను, కర్నూలు

రంజాన్‌లో సేవలు సంతృప్తినిస్తాయి



రంజాన్ అంటేనే ఉపవాస దీక్షలు. భక్తి రీత్యా రోజా ఉంటూనే వృత్తి రీత్యా స్కూల్‌కు వెళ్తున్నా. నమాజ్, జికర్‌లతో పాటు బాధ్యతగా తెల్లవారు జామున 2 గంటల తర్వాత నిద్రలేచి ఇంట్లో అందరికీ సహేరి ఏర్పాట్లు చేస్తాను. ఈ సేవలు మాకు ఎంతో సంతృప్తినిస్తాయి.

– షేక్ షబానా, గణిత ఉపాధ్యాయురాలు, కర్నూలు

మీ దీక్షకు సలాం..!

- రోజా పాటించేందుకు సహేరి తప్పని సరి
- వాటి ఏర్పాట్లలో మహిళల పాత్ర కీలకం
- అర్ధరాత్రి 2 గంటల నుంచే వంటల తయారీ
- పగలంతా ఇంటి పని, ఉపవాస దీక్షలు

కర్నూలు(రాజ్‌విహార్): ఉపవాస దీక్షల మాసం పవిత్ర రంజాన్. అల్లాహ్ మార్గాన్ని అనుసరించే పంచ సూత్రాల్లో మూడవది అయిన 'రోజా'కు ఎంతో ప్రాధాన్యత ఉంది. దీక్షలు పాటించాలంటే సహేరి (దీక్షకు ముందు తినే భోజనం) తప్పని సరి. అతి కొన్ని సందర్భాల్లో మాత్రమే సహేరి లేకుండా రోజా ఉండొచ్చు. కానీ సహేరి దీక్షదారుడికి శక్తితో పాటు అల్లాహ్ అనుగ్రహం లభిస్తుందనే నమ్మకం ఉంది. తెల్లవారు జామున దీక్షకు ముందు నిర్ణీత సమయంలోపే ఆహారం తీసుకోవాలి. ఆలోపు ఆహార పదార్థాల తయారీలో ఇంట్లో మహిళల పాత్ర ఎంతో కీలకం. పగలంతా ఇంటి పని, సాయంత్రం నుంచి ఆధ్యాత్మిక చింతన, రాత్రి తరావీహ్ నమాజ్‌ల తరువాతే నిద్ర. అలాగే సహేరి ఏర్పాట్ల కోసం అర్ధరాత్రి 2 తరువాత మహిళలు తప్పక నిద్ర లేవాలి. కుటుంబ సభ్యుల ఉపవాస దీక్ష కోసం వంటలు చేయాలి. ఒక పూట ఒక రోజు కాదు.. నెలంతా తమ నిద్రను త్యాగం చేస్తూ సహేరి ఏర్పాట్లలో కీలకపాత్ర పోషిస్తున్న ముస్లిం మహిళామూర్తులకు సలాం చేయాల్సిందే. పగలు రోజా ఉండి, కుటుంబ సేవలు చేయడంతో పాటు సాయంత్రం ఇఫ్తార్ వంటలు తయారు చేస్తారు. నమాజ్‌లు పూర్తయ్యాక 11 గంటల తరువాత పడుకుంటారు. మరోసటి రోజా కోసం అర్ధరాత్రి 2 గంటలు దాటాక సహేరి వంటల కోసం మేలుకుంటారు. మరి కొందరు ఉద్యోగాలకు వెళ్తూ కూడా అటు రంజాన్ మాసంలో సహేరి ఏర్పాట్లలో నిమగ్నమవుతారు.

బర్కత్ కలిగిన సహేరి:

'సహేరి ఖాయా కరో.. సహేరి మే బర్కత్ హై' అంటూ మహమ్మద్ ప్రవక్త రసూలుల్లా సొల్లెల్లాహు అలైహి వసల్లం చెప్పినట్లు ఒక హదీసు ద్వారా తెలుస్తోంది. అంటే రోజా దీక్షలకు ముందు భోజనం చేయండి. అందులో అల్లాహ్ అనుగ్రహం, పొదుపు ఉందని అర్థం. అంతటి మహత్తరం కలిగిన సహేరి తింటే మనిషికి శక్తితో పాటు అల్లాహ్ అనుగ్రహం లభిస్తుంది. దీనికి పంచభక్ష పరమాన్నాలు తినాల్సిన అవసరం లేదు. రోజువారిలా తినే ఆహారాన్ని భుజిస్తే చాలు.

మహిళలకు ప్రత్యేక పుణ్యం..

కళ్లల్లో నిద్ర ఉన్నా రంజాన్ శుభాలు, అల్లాహ్‌పై ఉన్న భక్తితో మేల్కొని వంటలు చేసే స్త్రీల పట్ల అనంత కరుణామయుడు ప్రత్యేక పుణ్యం ప్రసాదిస్తారు. తన కోసమే కాదు.. కుటుంబ సభ్యుల దీక్ష కోసం నెల రోజులు నిద్రను త్యాగం చేసి శ్రమిస్తారు. తెల్లవారు జామున 4 గంటల్లోపు కావాల్సిన వంటలు సిద్ధం చేస్తారు. దీంతో అల్లాహ్ స్త్రీలకు రెండింతల కంటే అధికంగా పుణ్యం ప్రసాదిస్తారని మౌల్వీలు పేర్కొంటున్నారు.


సహేరి వంటలు చేస్తున్న మహిళ

పట్టుబడిన కర్ణాటక మద్యం ధ్వంసం


మద్యాన్ని రోడ్డు రోలర్‌తో ధ్వంసం చేస్తున్న దృశ్యం

ఎమ్మిగనూరురూరల్: ఎమ్మిగనూరు, కోడుమూరు సెబ్ సర్కిల్ పరిధిలోని పట్టుబడిన కర్ణాటక మద్యాన్ని మంగళవారం ఏఈఎస్ ఇన్‌చార్జ్ రాజశేఖర్‌గౌడ్ ఆధ్వర్యంలో ధ్వంసం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెబ్ జాయింట్ డైరెక్టర్ కృష్ణకాంత్ పటేల్ ఆదేశాల మేరకు రెండు సర్కిళ్ల పరిధిలో 75 కేసుల్లో పట్టుబడిన మద్యాన్ని రోడ్డు రోలర్‌తో తొక్కించినట్లు తెలిపారు. ఎమ్మిగనూరు సెబ్ సర్కిల్ పరిధిలో 67 కేసుల్లో 24,550 టెట్రా ప్యాకెట్లు, వీటి విలువ రూ.13 లక్షలు, కోడుమూరు సర్కిల్ పరిధిలో 8 కేసుల్లో 6 వేల టెట్రా ప్యాకెట్లు వీటి విలువ రూ.3.15 లక్షలు ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మిగనూరు, కోడుమూరు సెబ్ సీఐలు జయరామానాయుడు, శ్యాంప్రసాద్, సెబ్ ఎస్ఐ సోమశేఖర్‌రావు, సిబ్బంది పాల్గొన్నారు.

జగనన్న లేఅవుట్లలో అన్ని వసతులు కల్పించాలి

- జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్


వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్

నంద్యాల: జగనన్న లేఅవుట్‌లలో ఇళ్ల నిర్మాణాల పురోగతి పెంచడంతోపాటు నీటి సరఫరా, డ్రైనేజీ, అంతర్గత రహదారులు తదితర మౌలిక వసతులు కల్పించాలని సంబంధిత అధికారులను జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఇళ్ల నిర్మాణాల పురోగతి, గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు, ఆయుష్మాన్ భారత్ సర్వే ప్రగతి, పారిశుద్ధ్యం, ఉపాధి పనులు తదితర అంశాలపై ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లు, హౌసింగ్, ఆర్‌డబ్ల్యూఎస్, పబ్లిక్ హెల్త్, ఏపీఎస్పీడీసీఎల్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ జగనన్న కాలనీల్లో అడిగిన వాళ్లకు వెంటనే విద్యుత్ కనెక్షన్ మీటర్ ఇవ్వాలని విద్యుత్ అధికారులకు సూచించారు. గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా పెండింగ్‌లో ఉన్న సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు, ఆయుష్మాన్ భారత్ సర్వే ప్రగతి వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. 0-5 సంవత్సరాల పిల్లల ఆధార్ నమోదు, పుట్టిన తేదీ ధ్రువీకరణ, 6-19 సంవత్సరాల గ్రాస్ ఎన్రోల్మెంట్ డేటా, గర్భిణుల హెల్త్ చెకప్, రక్తహీనత తదితర అంశాలకు చెందిన సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సర్వే త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. అలాగే ఆయుష్మాన్ భారత్ సర్వే 72 శాతం పూర్తి అయిందని, మిగిలిన 28 శాతాన్ని కూడా వారం రోజుల్లో పూర్తి చేసి నివేదిక అందజేయాలన్నారు. పాములపాడు, ప్యాపిలి, బేతంచెర్ల, బనగానపల్లె, నంద్యాల అర్బన్, గడివేముల తదితర మండలాల ప్రగతి తక్కువగా ఉందని ఎంపీడీఓలు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల యూనిట్ల పనితీరును పరిశీలించి వినియోగంలోకి తీసుకొచ్చేందుకు అవసరమైన ప్రతిపాదనలను సిద్ధం చేయాలని ఈఓ ఆర్‌డీలను ఆదేశించారు. గ్రామీణ ఉపాధి హామీ కింద లేబర్ రిపోర్టును గణనీయంగా పెంచాలన్నారు. లక్ష్యం మేరకు కూలీలకు పనులు కల్పించాలని ఏపీడీలను ఆదేశించారు. అమృత్ సరోవర్ కింద గుర్తించిన చెరువులను అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈఓ సుబ్బారెడ్డి, డీఎల్‌డీఓ జనార్దన్, హౌసింగ్ పీడీ రామశేషు, డీఆర్‌డీఏ పీడీ శ్రీధర్ రెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయ సెస్సు చెల్లించండి

- ఉమ్మడి జిల్లాలో రూ.20 కోట్ల బకాయి
- విలేకరుల సమావేశంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మద్దూరు సుభాష్ చంద్రబోస్


మాట్లాడుతున్న జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సుభాష్ చంద్రబోస్

కర్నూలు కల్చరల్: పురపాలక సంస్థలు, గ్రామ పంచాయితీలు గ్రంథాలయ సెస్సు చెల్లించాలని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మద్దూరు సుభాష్ చంద్రబోస్ కోరారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో రూ.20 కోట్ల మేర బకాయి ఉందని తెలిపారు. మంగళవారం జిల్లా కేంద్ర గ్రంథాలయ సంస్థలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పురపాలక సంస్థలు, గ్రామ పంచాయతీలు వసూలు చేసే పన్నుల్లో 8 శాతం గ్రంథాలయాల అభివృద్ధికి చెల్లించాల్సి ఉందన్నారు. కర్నూలు నగర పాలక సంస్థ రూ.9 కోట్లు, నంద్యాల మున్సిపాలిటీ రూ.40 లక్షలు, నందికొట్కూరు మున్సిపాలిటీ రూ.30 లక్షలు, గూడూరు రూ.14 లక్షలు, బేతంచెర్ల రూ.20 లక్షలు, ఆత్మకూరు రూ.22 లక్షలు, ఆళ్లగడ్డ రూ.4 లక్షలు బకాయి ఉందన్నారు. డోన్, ఆదోని, ఎమ్మిగనూరు మున్సిపాలిటీలు మాత్రమే క్రమం తప్పకుండా సెస్సు చెల్లిస్తున్నాయన్నారు. శిరివెళ్ల, మిడుతూరు, పాణ్యం, ప్యాపిలి, పాములపాడు, మద్దికెర, మంత్రాలయం, కోడుమూరు గ్రామ పంచాయతీలు మాత్రమే బకాయి లేకుండా సెస్సు చెల్లిస్తున్నాయన్నారు. మిగతా పంచాయతీలు సెస్సు ఊసే ఎత్తడం లేదన్నారు. కర్నూలు నగరపాలక సంస్థ కమిషనర్‌ను తానే స్వయంగా రెండు సార్లు కలిసి బకాయి వివరాలు వివరించామన్నారు. మిగత వాటికి ప్రతి మూడు నెలలకు ఒకసారి రిమైండర్ చేస్తూ నోటీసులు ఇస్తున్నా స్పందించడం లేదన్నారు. విలేకరుల సమావేశంలో ఇన్‌చార్జ్ గ్రంథాలయ సెక్రటరీ పెద్దక్క, గ్రంథాలయ సంస్థ ఉద్యోగుల సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షులు వజ్రాల గోవిందరెడ్డి, ఉద్యోగులు మక్బూల్‌బాషా, రాజు పాల్గొన్నారు.

108లో మహిళ ప్రసవం

- కష్ట కాన్పు చేసి తల్లీబిడ్డను కాపాడిన 108 సిబ్బంది
- మూడు కాన్పుల్లో మహిళకు దక్కని సంతానం
- నాలుగో కాన్పులో తల్లీబిడ్డ క్షేమం

హొళగుంద: మండల కేంద్రం హొళగుంద 6వ వార్డుకు చెందిన గర్భిణి రంగమ్మ 108లో ఆడ శిశువుకు జన్మనిచ్చింది. 108 సిబ్బంది కష్ట కాన్పు చేసి తల్లీబిడ్డను కాపాడారు. మంగళవారం తెల్లవారు జామున రంగమ్మకు పురిటి నొప్పులు రావడంతో కుటుంబీకులు 108కు ఫోన్ చేయగా హొళగుంద సీహెచ్‌సీకి తరలించారు. ఆమె పరిస్థితి విషమంగా ఉండడంతో వైద్యులు మెరుగైన చికిత్సకు రెఫర్ చేశారు. దీంతో 108లో రంగమ్మను బళ్లారికి తరలిస్తుండగా మార్లమడికి వద్ద నొప్పులు తీవ్రమైయ్యాయి. దీంతో ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్ (ఈఎమ్టీ) యల్లయ్య, పైలెట్ ఉప్పరి సురేష్ సహకారంతో రంగమ్మకు సుఖ ప్రసవం జరగడానికి చికిత్స నిర్వహించారు. అయితే శిశువు ఎదురుకాళ్లతో అతి కష్టం మీద జన్మించింది. కాగా గర్భాశయంలో ఉమ్మి నీరు మింగడంతో శిశువులో ఎలాంటి కదలికలు కానరాలేదు. దీంతో ఈఎమ్టీ యల్లయ్య వెంటనే సెక్షన్ ట్యూబ్‌ను శిశువు నోటిలో పెట్టి ఉమ్మినీరును తొలగించి ఆక్సిజన్ అందించి బతికించారు. తల్లీబిడ్డ క్షేమంగా ఉండడంతో వారిని సమీపంలోని కర్ణాటక రాష్ట్రం కరూరు ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించారు. కాగా రంగమ్మకు ఇప్పటికే మూడు కాన్పులు జరగగా ఏ ఒక్క శిశువు దక్కలేదని, నాలుగవ కాన్పులో శిశువుతో పాటు తల్లి ఆరోగ్యంగా ఉన్నట్లు ఈఎమ్టీ తెలిపారు. రంగమ్మ కుటుంబీకులు 108 సిబ్బందికి కృజ్ఞతలు తెలిపారు.


శిశువుతో 108 ఈఎమ్టీ ఎల్లయ్య

ఒక్క విద్యార్థి కూడా డ్రాపౌట్ కాకూడదు

- విద్యాశాఖ సమీక్షలో కలెక్టర్ డాక్టర్ సృజన



కర్నూలు(సెంట్రల్): ఒక్క విద్యార్థి కూడా మధ్యలో బడి మానేసి పనులకు వెళ్లకూడదని, ఆ మేరకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ డాక్టర్ జి.సృజన విద్యాశాఖాధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో ఆమె విద్యాశాఖపై సమీక్షించారు. ముందుగా జిల్లాలో ప్రైవేట్, ప్రభుత్వ పాఠశాలలు కలిపి 2,239 ఉన్నాయని, ఇందులో 13,637 మంది ఉపాధ్యాయులు పనిచేస్తుండగా, 4,50,671 మంది విద్యార్థులు ఉన్నట్లు డీఈఓ రంగారెడ్డి కలెక్టర్‌కు వివరించారు. ఇందులో మోడల్ స్కూళ్లు 16, ఏపీ రెసిడెన్షియల్ పాఠశాలలు 8 ఉన్నాయని, వాటిలో బాలబాలికలకు ప్రత్యేక వసతి గృహాలు ఉన్నాయని చెప్పారు. అనంతరం కలెక్టర్ డాక్టర్ జి.సృజన మాట్లాడుతూ.. బాలికలకు ప్రత్యేక వసతి గృహాలు ఎక్కడెక్కడ ఉన్నాయో, వాటికి సంబంధించి నివేదికలు అందజేయాలని ఆదేశించారు. అదే విధంగా బడి బయట ఎంత మంది పిల్లలు ఉన్నారో సీఆర్‌పీలు, సచివాలయాల్లో ఉన్న సంక్షేమ, ఎడ్యుకేషన్ అసిస్టెంట్లు, ఏఎన్ఎంలు, అంగన్‌వాడీ వర్కర్స్‌తో ఇంటింటా సర్వే చేయించాలని డీఈఓను ఆదేశించారు. గ్రామ, వార్డు సచివాలయాలు, విద్యా, వైద్య, మహిళా శిశు సంక్షేమ శాఖలు సమన్వయంతో బడి మానేసిన విద్యార్థులను గుర్తించాలన్నారు.

మహిళల అక్షరాస్యత కేవలం 40 శాతమేనా..?

జిల్లాలో మహిళల అక్షరాసత్య కేవలం 40 శాతమే ఉండడం దారుణమని, అక్షరాస్యతను పెంపొందించేందుకు తొలి మహిళా సర్వోన్నతాధికారిగా తన బాధ్యత అని కలెక్టర్ పేర్కొన్నారు. బాల్య వివాహాల నిరోధానికి కూడా కట్టుబడి పనిచేస్తానని చెప్పారు. గిరిజన ప్రాంతాల్లో మహిళల్లో అక్షరాస్యత మెరుగ్గా ఉందని చెప్పారు. మహిళల్లో అక్షరాస్యతను పెంపొందించేందుకు విద్యా, సంక్షేమ శాఖలు, మహిళా శిశు సంక్షేమ శాఖలు సమన్వయంతో పనిచేయాలన్నారు. వసతి గృహాల నుంచి ఇళ్లకు వెళ్లిన విద్యార్థినులకు పెళ్లి చేస్తారనే భయం ఉండకూడదని, ఇందుకోసం మండల స్థాయి స్పెషల్ ఆఫీసర్ వ్యవస్థను ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో డీఈఓ రంగారెడ్డి, సమగ్ర శిక్ష ఏపీసీ వేణుగోపాల్, మధ్యాహ్న భోజన సహాయ సంచాలకులు శ్యాముల్‌పాల్ పాల్గొన్నారు.

విధుల్లో ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు

- ఫార్మసిస్ట్, ఏఎన్ఎంపై డీఎంహెచ్ఓ ఆగ్రహం


విచారణ చేస్తున్న డీఎంహెచ్ఓ డాక్టర్ వెంకటరమణ

నందికొట్కూరు: విధి నిర్వహణలో ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని నంద్యాల జిల్లా డీఎంహెచ్ఓ డాక్టర్ ఆర్. వెంకటరమణ వైద్య సిబ్బందిని హెచ్చరించారు. స్థానిక సాయిబాబాపేటలోని అర్బన్ హెల్త్ సెంటర్‌లో ఆశా వర్కర్ నజిరున్నీసా ఆత్మహత్యాయత్నం సంఘటనపై డీఎంహెచ్ఓ మంగళవారం నందికొట్కూరుకు విచారణ చేపట్టారు. ఆరోగ్యం సహకరించకపోవడంతో హాజరు కాలేని పరిస్థితిలో ఆశా వర్కర్ ఉండగా డీఎంహెచ్ఓ ఫోన్‌లో విచారించారు. సచివాలయం పరిధిలోని మరో ఇద్దరు ఆశావర్కర్లు విచారణకు హాజరయ్యారు. ఏఎన్ఎం వేధింపులపై వారు డీఎంహెచ్ఓకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళల పట్ల ఇష్టానుసారంగా ప్రవర్తిస్తే కఠిన చర్యలు తప్పవని ఫార్మసిస్ట్ అబ్దుల్లాను హెచ్చరించారు. ఆశా వర్కర్ సమస్యను డాక్టర్ షైన్ ప్రియాంక చూసుకుంటారని, ఎందుకు చేసుకున్నావని ఏఎన్ఎం సావిత్రిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. నిబంధనల మేరకు ఎవరి పరిధిలో వారు విధులు నిర్వర్తించాలని సూచించారు. ఫార్మసిస్టుకు, ఏఎన్ఎంకు, ఆశా వర్కర్‌కు షోకాజ్ నోటీషులు జారీ చేస్తానని తెలిపారు. విచారణలో ఎవరిది తప్పు తేలితే వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

మాజీ ఎమ్మెల్యే నీరజారెడ్డికి కన్నీటి వీడ్కోలు


అంతిమ యాత్రలో పాల్గొన్న గ్రామస్తులు, అభిమానులు (ఇన్‌సెట్లో) మాజీ ఎమ్మెల్యే నీరజారెడ్డి (ఫైల్)

- పలువురు రాజకీయ నాయకుల నివాళులు

ఆలూరు: రెండు రోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందిన ఆలూరు మాజీ ఎమ్మెల్యే నీరజారెడ్డికి అభిమానులు, బంధువులు, కుటుంబీకులు కన్నీటి వీడ్కోలు పలికారు. మంగళవారం తెర్నేకల్ గ్రామంలో అంత్యక్రియలు నిర్వహించారు. ఆదివారం హైదరాబాద్ నుంచి స్వగ్రామం తెర్నేకల్‌కు కారులో వస్తుండగా తెలంగాణ రాష్ట్రం గద్వాల జిల్లా బీచ్‌పల్లి వద్ద కారు టైరు పేలి బోల్తా పడడంతో ఆమె తీవ్రంగా గాయపడి మృతి చెందిన విషయం తెలిసిందే. సోమవారం ఆమె మృతదేహానికి కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో ఫోరెన్సిక్ హెచ్‌వోడీ డాక్టర్ సాయిసుధీర్ పోస్టుమార్టం నిర్వహించారు. అనంతరం ఆమె మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించడంతో తెర్నేకల్‌కు తరలించారు. అమెరికాలో ఉంటున్న నీరజారెడ్డి కుమార్తె హిమవర్షిణి సోమవారం రాత్రి స్వగ్రామానికి చేరుకుని కన్నీరు మున్నీరుగా విలపించారు. మంగళవారం ఉదయం 10 గంటల అంతిమయాత్ర ప్రారంభం కాగా చుట్టు పక్కల గ్రామస్తులు, రాజకీయ నాయకులు పెద్ద ఎత్తున తరలివచ్చి కన్నీటి వీడ్కోలు పలికారు. నీరజారెడ్డి భర్త మాజీ ఎమ్మెల్యే పాటిల్ శేషిరెడ్డి వర్ధంతి రోజున ఆమె అంత్యక్రియలు నిర్వహించడంతో అభిమానులు శోకసంద్రంలో మునిగారు. భర్త సమాధి పక్కనే ఆమెకు దహన సంస్కారాలు చేపట్టారు. అంత్యక్రియల్లో ఎమ్మిగనూరు ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి, మంత్రి గుమ్మనూరు సోదరులు శ్రీనివాసులు, నారాయణస్వామి, రాష్ట్ర వైఎస్సార్‌సీపీ నాయకుడు సురేంద్రారెడ్డి, విక్రాంత్‌రెడ్డి, దేవనకొండ ఎంపీపీ లక్ష్మీదేవి, జెడ్పీటీసీ సభ్యుడు రామకృష్ణ, సీపీఎం, సీపీఐ నాయకులు, దేవనకొండ మండలం సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు అరుణ్‌కుమార్, నగరడోణ లింగారెడ్డి, రాజనారాయణ, కురుబ ఈరన్న, నియోజకవర్గ టీడీపీ మాజీ ఇన్‌చార్జ్‌లు వీరభద్రగౌడు, వైకుంఠం మల్లికార్జునచౌదరి, వివిధ గ్రామాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు తదితరులు తరలివచ్చి నివాళ్లులర్పించారు.